క్లుప్తంగా

ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడిగా లింగయ్య



నియామక పత్రం అందజేస్తున్న శంకర్

మునుగోడు : కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడిగా మండలంలోని కొంపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బోయపర్తి లింగయ్య నియమితులయ్యారు. శనివారం లింగయ్యకు ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ ఆదిమల్ల శంకర్ నియామక పత్రం అందించారు.

కార్మికులకు దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న దైద రవీందర్

నకిరేకల్ : కాంగ్రెస్ పార్టీ నాయకుడు దైద రవీందర్ జన్మదిన వేడుకలను నకిరేకల్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మెయిన్ సెంటర్‌లో నకిరేకల్ మున్సిపాలిటీ కార్మికులకు దైద రవీందర్ దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు గాజుల సుకన్య శ్రీనివాస్, దైద స్వప్న, కాంగ్రెస్ నాయకులు గార్లపాటి రవీందర్‌రెడ్డి, నామిరెడ్డి కృష్ణారెడ్డి, దేవులపల్లి వెంకన్న, చింతల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

చిట్యాల : మండలంలోని ఉరుమడ్ల గ్రామానికి చెందిన కల్లూరి చంద్రయ్య(62) శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. అతడి అంత్యక్రియల నిమిత్తం గుత్తా వెంకట్‌రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి ఏర్పాటు చేసిన రూ.15 వేలను ట్రస్ట్ సభ్యులు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. అదేవిధంగా గ్రామానికి చెందిన జన్నపాల మహేష్ ఇటీవల ఈతకు వెళ్లి బావిలో మునిగిపోయి మృతి చెందాడు. మృతుడి కుటుంబానికి పది వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని ట్రస్ట్ తరఫున అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు ఉయ్యాల నరేష్‌గౌడ్, దోటి భిక్షం, రాచమల్ల వెంకన్న, దండంపల్లి శివ, బోయ సాయి, శంకరయ్య, మిర్ర అశోక్, పవన్, కోనేటి కృష్ణ పాల్గొన్నారు.

కనగల్ : మండల పరిధిలోని చర్లగౌరారం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ బండ్ల భిక్షం ఇటీవల గుండెపోటుతో మరణించాడు. ఆయన కుటుంబ సభ్యులను శనివారం బీఆర్ఎస్ నాయకుడు పిల్లి రామరాజు పరామర్శించి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట వంగూరి నాగబాబు, జినుకుంట్ల జయశంకర్‌గౌడ్, చనగాని అజయ్, గుండెబోయిన ఉపేందర్ తదితరులు ఉన్నారు.

రిటైర్డ్ తహసీల్దార్ మృతి

మునుగోడు : మండల కేంద్రానికి చెందిన రిటైర్డ్ తహసీల్దార్ పెరుమాండ్ల లింగయ్య (72) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. శనివారం జరిగిన అంత్యక్రియలకు తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్, వరంగల్ టీ న్యూస్ ప్రతినిధి బట్టపోతుల ప్రదీప్ హాజరై లింగయ్య మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. జంగిలి నాగరాజు తదితరులు ఉన్నారు.

న్యాయం చేయాలని వినతి

కనగల్ : తమకు న్యాయం చేయాలని కోరుతూ మండల కేంద్రంలోని పద్మశాలీలు శనివారం తహసీల్దార్ శ్రీనివాస్‌రావును కలిసి వినతిపత్రం అందజేశారు ఈ సందర్భంగా పద్మశాలీలు మాట్లాడుతూ మండల కేంద్రం శివారులో 30 ఏళ్ల క్రితం 632 సర్వే నంబర్ పరిధిలో 3.21 ఎకరాల భూమిని కొనుగోలు చేశామని, ఆర్థిక ఇబ్బందుల కారణంగా కొందరు అమ్ముకున్నారని తెలిపారు. ఇదే అదునుగా తమ భూమిని సమీప రైతులు ఆక్రమించారని తహసీల్దార్‌కు వివరించారు. మిగిలిన భూమికి హద్దులు నిర్ణయించి తమకు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ యాదగిరి, వీఆర్ఏ వెంకన్న మాజీ సర్పంచ్, వైస్ ఎంపీపీ భారత వెంకటేశం, చేనేత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కట్టంగూర్ : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రామ పంచాయతీ కార్మికులు శనివారం ఎంపీడీఓ పోరెళ్ల సునితకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీఓ నంబర్ 51ని సవరించాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు వేతనాలు సవరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ అథర్ ఫర్వేజ్, నార్కట్‌పల్లి, కట్టంగూర్, కేతేపల్లి, నకిరేకల్ మండలాల యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న జీపీ కార్మికులు

గొర్రెల పంపిణీ పూర్తయ్యేనా !

- డీడీలు కట్టి ఎదురుచూస్తున్న లబ్ధిదారులు
- మునుగోడు నియోజకవర్గంలో 7600 మంది ఎంపిక
- అందులో కేవలం 278 మందికే గొర్రెలు అందజేత



మునుగోడు : రాష్ట్రంలోని గొల్ల కుర్మల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం ప్రతి ఒక కుటుంబానికి రూ. లక్షా 45వేలతో ఒక గొర్రెల యూనిట్‌ని అందిస్తోంది. గొర్రెల పంపిణీ రెండో దఫా కార్యాక్రమాన్ని దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 9న సంక్షేమ దినోత్సవం సందర్భంగా ప్రతి నియోజకవర్గంలోని ఓ గ్రామాన్ని ఎంచుకుని 24 మంది లబ్ధిదారులకు పంపిణీ చేయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుని అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు సంక్షేమ దినోత్సవం రోజున ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలో మంత్రి, స్థానిక ఎమ్మెల్యే చేతుల మీదుగా గొల్ల కుర్మలకు గొర్రెలను పంపిణీ చేశారు. కానీ మునుగోడులో మాత్రం గొర్రెల పంపిణీ చేపట్టలేదు. ప్రభుత్వ ఆదేశాల మేరకు స్థానిక ఎమ్మెల్యే సూచన ప్రకారం నియోజకవ్గంలోని మర్రిగూడ మండల పరిధిలో గల ఎరగండ్లపల్లి గ్రామంలోని 24 మంది గొల్ల కుర్మలను ఎంపిక చేశారు. ఆ రైతులను జిల్లా అధికారులు గొర్రెల కొనుగోలుకు ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం, కడప జిల్లాలకు 6వ తేదీన తీసుకెళ్లి నచ్చిన గొర్రెలు కొనుగోలు చేయాలని సూచించారు. కానీ అక్కడి గొర్రెలు ఆ రైతులకు నచ్చకపోవడంతో ఈ నెల 8వ తేదీన తిరిగి వెనక్కి వచ్చారు. దీంతో సంక్షేమ దినోత్సవం రోజు మునుగోడులో గొర్రెల పంపిణీ జరగలేదు.

7322 గొల్లకుర్మల ఎదురుచూపు..

మునుగోడు ఉప ఎన్నికల సందర్భంగా నియోజకవర్గంలోని గొల్ల కుర్మలకు గొర్రెలు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం 7,600 మందిని ఎంపిక చేసి, ఒక్కొక్కరి నుంచి రూ. 44 వేల వాటాధనం డీడీల రూపంలో తీసుకుంది. ఎన్నికల కోడ్ అడ్డురావడంతో పంపిణీ నిలిపివేసింది. ఎన్నికల ఫలితాల అనంతరం మునుగోడు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 278 మందికి జనవరి, ఫిబ్రవరి మాసంలో గొర్రెలను పంపిణీ చేశారు. మిగిలిన 7,322 మంది అర్హులకు నేటికీ అందించలేదు. దశాబ్ది ఉత్సవాల్లో అయినా తమకు గొర్రెలు అందుతాయని లబ్ధిదారులు ఆశపడ్డారు. అయినా అందకపోవడంతో నిరాశకు లోనవుతున్నారు. తమ వాటాధనం రూ.44వేలు అప్పు తీసుకొచ్చి డీడీ కట్టడంతో వాటికి వడ్డీ రోజురోజుకూ పెరిగిపోతోందని లబ్ధిదారులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని మునుగోడు నియోజకవర్గంలోని అర్హులైన గొల్ల కుర్మలకు వెంటనే గొర్రెలను పంపిణీ చేయాలని కోరుతున్నారు.

డీడీలు కట్టి ఎదురుచూస్తున్నాం



ఉప ఎన్నికల సందర్భంగా ప్రతి ఒక్కరికీ గొర్రెలు పంపిణీ చేస్తామంటే గత ఏడాది సెప్టెంబర్ మాసంలో రూ. 44వేల చొప్పున డీడీలు కట్టి గొర్రెల కోసం ఎదురుచూస్తున్నాం. కానీ నేటికీ మాకు గొర్రెలు అందలేదు. దీనికి తోడు మా బ్యాంక్ ఖాతాలు ఫ్రీజ్ చేయడంతో ఇతర లావాదేవీలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. దశాబ్ది ఉత్సవాల్లో అయినా గొర్రెలు వస్తాయని ఆశపడ్డాం. కానీ మునుగోడులోనే పంపిణీ చేయలేదు.

–సాగర్ల లింగస్వామి, మునుగోడు గొల్ల కుర్మల సంఘం అధ్యక్షుడు

ఉత్సవాలు ముగిశాక పంపిణీ చేస్తాం

దశాబ్ది ఉత్సవాలు ముగిసిన తరువాత లబ్ధిదారులకు గొర్రెలు పంపిణీ చేపడుతాం. సంక్షేమ దినోత్సవం రోజు గొర్రెలను అందించేందుకు 22 మందిని ఎంపికచేశాం. కొనుగోలు కోసం పంపిస్తే సరైన గొర్రెలు దొరకక రైతులు తిరిగి వచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి పంపిణీ జరుగుతుండడంతో నాణ్యమైన గొర్రెలు లభించడం లేదు. ఈ నెల 25వ తేదీ లోపు అర్హులైన అందరినీ కేటాయించిన జిల్లాలకు పంపి ఎంపిక చేసుకోవాలని సూచిస్తాం.

–ఏ. యాదగిరి, పశుసంవర్ధకశాఖ జేడీ నల్లగొండ

నిధులు ఖర్చుచేయడంలో నిర్లక్ష్యం వహించొద్దు

మునుగోడు : నియోజకవర్గ అభివృద్ధికి మంజూరైన నిధులు ఖర్చు చేయడంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించొద్దని మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గానికి మంజూరైన ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన, గిరిజన అభివృద్ధి, ఉపాధిహామీ ద్వారా నిర్మించిన సీసీ రోడ్లు, ఎస్‌డీఎఫ్ నిధులపై శనివారం మునుగోడు క్యాంపు కార్యాలయంలో పంచాయతీరాజ్ ఎస్సీ జీజేవీఎస్ ప్రకాష్‌తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రారంభించిన పనులు వెంటనే పూర్తి చేయించాలని సూచించారు. మంజూరైన ప్రతి రూపాయిని ఖర్చుచేస్తే తిరిగి ఇతర పనుల కోసం నిధులు మంజూరు చేయిస్తానని అన్నారు. చేపడుతున్న పనుల్లో ఎలాంటి నాణ్యత లోపం లేకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో ఈఈలు తిరుపతయ్య, ఎన్. వెంకటేశ్వర్లు, డీఈలు రఘుపతి, బాలచందర్, ఏఈలు తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

మూసీ నుంచి ఇసుక అక్రమ రవాణా



అక్రమంగా తరలిస్తున్న ఇసుక

నార్కట్‌పల్లి : మండలంలోని అమ్మనబోలు గ్రామ సమీపంలో గల మూసీ వాగు నుంచి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారు. ప్రతి రోజూ ఈ వాగు నుంచి 20 ట్రాక్టర్ల పైనే ఇసుకను అక్రమంగా తరలిస్తున్నప్పటికీ పోలీస్ యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. ఒక్కో ట్రాక్టర్ ట్రిప్పునకు రూ.4వేల వరకు వసూలు చేస్తున్నారు. పోలీసు, రెవెన్యూ అధికారులకు తెలిసినప్పటికీ పట్టించుకోవడం లేదు. శనివారం ఇసుకను ట్రాక్టర్లతో అక్రమంగా రవాణా చేస్తుండడాన్ని కొంతమంది యువకులు గుర్తించి వాట్సాప్‌లలో పోస్టులు పెట్టడంతో వైరల్‌గా మారింది. ఈ ఇసుక దందా పోలీస్‌లు, ప్రజాప్రతినిధుల కనుసన్నల్లోనే సాగుతోందని పలువురు యువకులు ఆరోపిస్తున్నారు. ఇసుక దందాను ఆపేదేవరు..? అని యువకులు ప్రశ్నిస్తున్నారు. అమ్మనబోలు గ్రామంలో అక్రమంగా ఇసుక రవాణా చేసే ట్రాక్టర్లు 70 వరకు ఉన్నాయని సమాచారం. వాగు నుంచి తరలించిన ఇసుకను పలు ప్రాంతాల్లో డంప్ చేస్తున్నారని పోస్టులు పెట్టిన యువకులు పేర్కొంటున్నారు.

తిప్పర్తి పీహెచ్‌సీకి జాతీయ అవార్డు రావడం హర్షణీయం

రామగిరి(నల్లగొండ) : తిప్పర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి నేషనల్ క్వాలిటీ అసురెన్స్ స్టాండర్డ్ అవార్డు రావడం హర్షణీయమని ఎంపీపీ నాగులవంచ విజయలక్ష్మిలింగారావు అన్నారు. శనివారం తిప్పర్తి పీహెచ్‌సీలో జరిగిన జన ఆరోగ్య సమితి సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పీహెచ్‌సీ సిబ్బంది మెరుగ్గా పనిచేయడం వల్లనే అవార్డు వచ్చిందన్నారు. ఇదే స్ఫూర్తితో పనిచేసి రోగులకు మంచి సేవలు అందించాలన్నారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎమ్.ప్రదీప్‌బాబు మాట్లాడుతూ ఇటీవల జరిగిన దశాబ్ది ఉత్సవాల్లో మంత్రి జగదీశ్ రెడ్డి, ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డు, సర్టిఫికెట్ అందుకున్నామన్నారు. ఈ సమావేశంలో హోమియోపతి డాక్టర్ పి.అరుణ, సిబ్బంది ఏ.శేషాదేవి, ఆర్.అలివేలు, మంగమ్మ, ఎస్.అనిత్‌కుమార్, జి.పార్వతి పాల్గొన్నారు.

హుండీ చోరీ

నార్కట్‌పల్లి : మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు హుండీని చోరీ చేసినట్లు ఆలయ ప్రధాన అర్చకుడు జానకిరామశర్మ తెలిపారు. శనివారం ఉదయం పూజ చేయడానికి ఆలయానికి వచ్చేసరికి హుండీ కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

కేసీఆర్ పాలనలోనే గిరిజనులకు పెద్దపీట

కనగల్ : గిరిజనులకు పెద్దపీట వేసింది సీఎం కేసీఆర్ పాలనలోనే అని ఎంపీపీ కరీంపాష అన్నారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని ఇస్లాంనగర్ గ్రామపంచాయతీ పరిధిలోని కేబీ తండాలో గిరిజనోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా తండాలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎంపీపీ కరీంపాష మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం తండాలను గ్రామపంచాయతీలుగా చేసి 6శాతం ఉన్న రిజర్వేషన్‌ను 10శాతానికి పెంచిందన్నారు. రాష్ట్రంలో 94 గిరిజన పాఠశాలలను స్థాపించి గిరిజన విద్యార్థుల భవిష్యత్ కోసం పాటుపడిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ ముజీబుద్దీన్, తరి వెంకట్, కార్యదర్శి హరీశ్, రాజు, జాన్సిరామ్ పాల్గొన్నారు.

చండూరు(గట్టుప్పల) : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గట్టుప్పల మండల పరిధిలో ధర్మతండాలో శనివారం గిరిజనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తండా వాసులకు సర్పంచు ఇడెం రోజా స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఇడెం కైలాసం, శంకరయ్య, కోటా, హర్ష, ధర్మనాయక్, లక్ష్మి, సురేష్ పాల్గొన్నారు.

తండాలను పంచాయతీలుగా మార్చిన ఘనత కేసీఆర్‌దే

మర్రిగూడ : ఆవాస ప్రాంతాలుగా ఉన్న గిరిజన తండాలను గ్రామపంచాయతీలుగా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌దే అని ఎంపీపీ మెండు మోహన్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం రాజాపేటతండా, వెంకేపల్లి తండాల్లో గిరిజన ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజాపేటతండాలో శ్మశానవాటిక ఏర్పాటు చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. అనంతరం గ్రామపంచాయతీ ఏర్పడిన తరువాత మొదటి సర్పంచ్‌లు అయిన నూన్సావత్ సక్కుబాయి, బిచ్చనాయక్, కొర్ర శ్రీనులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జె.వెంకటేశ్వర్‌రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేశ్వర్లు, ఎంపీఓ ఝాన్సీ, ఏపీఎం సంకు హరి, వార్డెన్ రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు యాకుబ్, యాదగిరి, వార్డు మెంబర్లు లక్ష్మణ్‌నాయక్, సరిత తదితరులు పాల్గొన్నారు.



కనగల్ : కేబీ తండాలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న ఎంపీపీ కరీంపాష



మర్రిగూడ : రాజాపేటతండాలో మాట్లాడుతున్న ఎంపీపీ మోహన్‌రెడ్డి



చండూరు : ధర్మతండాలో గిరిజనులతో సర్పంచ్ ఇడెం రోజా

రేవంత్‌రెడ్డిని కలిసిన మునుగోడు నేతలు

మునుగోడు : టీ పీసీసీ అధ్యక్షుడు ఏ.రేవంత్‌రెడ్డిని శనివారం మునుగోడు నియోజకవర్గానికి చెందిన టీ పీసీసీ ప్రధాన కార్యదర్శి చలమల్ల కృష్ణారెడ్డితోపాటు పలువురు కాంగ్రెస్ నాయకులు హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా మునుగోడు నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలతోపాటు ఇక్కడి రాజకీయ పరిస్థితులను రేవంత్‌రెడ్డికి వివరించారు. నియోజకవర్గంలో సభలు ఏర్పాటు చేయించి హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కిష్టాపురం ఎంపీటీసీ భీమనపల్లి సైదులు తదితరులు ఉన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన

కనగల్ : తహసీల్దార్ కార్యాలయం అవినీతిమయం అయిందని ఆరోపిస్తూ శనివారం జి యడవల్లి గ్రామానికి చెందిన కానుగు లింగస్వామి కనగల్ తహసీల్దార్ కార్యాలయ మెట్లపై కూర్చుని నిరసన వ్యక్తం చేశాడు. కుల,ఆదాయ పత్రాలతోపాటు భూముల రిజిస్ట్రేషన్ కోసం డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించాడు. విచారణ చేపట్టి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను కోరాడు.

ఏకకాలంలో రైతు రుణమాఫీ చేయాలి



చిట్యాల : తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

చిట్యాల : రైతులకు లక్ష రూపాయల రుణమాఫీ ఏకకాలంలో అమలుచేసి ఆదుకోవాలని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఐతరాజు నర్సింహ, జిల్లా కమిటీ సభ్యుడు అర్రూరి శ్రీను రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ చిట్యాల తహసీల్దార్ కార్యాలయం ఎదుట శనివారం రైతు సంఘం, సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో వారు పాల్గొని మాట్లాడారు. లక్ష రూపాయలు తీసుకున్న రైతులకు నాలుగేళ్ల వడ్డీ రుణభారాన్ని ప్రభుత్వం చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య, నాయకులు పామనగుల్ల అచ్చాలు, నారబోయిన శ్రీనివాసులు, శీలరాజయ్య, లడే రాములు, మెట్టు నర్సింహ, సుర్కంటి బుచ్చిరెడ్డి, నెల్లికంటి నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

చండూరు : ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రైతులకు రుణమాఫీ చేసి ఆదుకోవాలని కోరుతూ సీపీఎం మండలం సహాయ కార్యదర్శి జెర్రిపోతుల ధనంజయ్య శనివారం స్థానిక తహసీల్దార్ అర్చనారెడ్డికి వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా ధనంజయ్య మాట్లాడుతూ ఎన్నికల ముందు రుణమాఫీ చేస్తామని కేసీఆర్ హామీ ఇచ్చి అమలు చేయలేదన్నారు. ఆయన వెంట కొత్తపల్లి నర్సింహ, సైదులు, లింగయ్య తదితరులు ఉన్నారు.

రైతు రుణమాఫీ అమలుచేయాలని వినతి

మర్రిగూడ : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు బీఆర్ఎస్ ప్రభుత్వం వెంటనే రైతులకు రూ.లక్ష రుణమాఫీ చేయాలని కోరుతూ సీపీఎం మండల కార్యదర్శి ఏర్పుల యాదయ్య శనివారం మండల కేంద్రంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. పండించిన పంటకు గిట్టుబాటు ధర ఇవ్వాలని, ఐకేపీ సెంటర్‌లో అమ్మిన ధాన్యానికి వెంటనే డబ్బులు జమ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు కొట్టం యాదయ్య, ఉప్పునూతల వెంకటయ్య, మేకల రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శాలిగౌరారం : రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఏకకాలంలో లక్ష రూపాయల రుణమాఫీ వెంటనే చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో శనివారం తహసీల్దార్ శ్రీనివాసరెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. పార్టీ మండల కార్యదర్శి చలకాని మల్లయ్య, నూనె గట్టయ్య, డెంకెల లింగయ్య, మక్క బుచ్చిరాములు, సిరుపంగి అంజి, సింగరి వెంకన్న, రావుల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపు దేవస్థాన భూముల కౌలు వేలం

కనగల్ : మండలంలోని ఎం గౌరారం గ్రామపంచాయతీ పరిధిలో గల హాలియా మండలం మారెపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన కౌలు భూములకు సోమవారం వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ అంబటి నాగిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు ముందుగా రూ.10వేలు డిపాజిట్ చేసి పాల్గొనాలన్నారు. మొత్తం 189 ఎకరాల భూమికి సంబంధించి 70 ప్లాట్లకు వేలం నిర్వహిస్తామని పేర్కొన్నారు. కనగల్ మండల పరిధిలోని రైతువేదికలో వేలం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

పీపుల్స్ మార్చ్‌ను విజయవంతం చేయండి

నకిరేకల్ : సీఎల్పీ నేత భట్టి విక్రమార్క తలపెట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర ఈ నెల 19న నకిరేకల్‌కు చేరుతుందని, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని టీ పీసీసీ ప్రధాన కార్యదర్శి కొండేటి మల్లయ్య పిలుపునిచ్చారు. నకిరేకల్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 19న సాయంత్రం మండలంలోని తాటికల్‌కు భట్టి విక్రమార్క చేరుకుంటారని, 20న ఉదయం 8 గంటలకు నకిరేకల్ మెయిన్ సెంటర్‌లో కార్నర్ మీటింగ్ ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు సుంకరబోయిన నర్సింహయాదవ్, పన్నాల రాఘవరెడ్డి, లింగాల వెంకన్న, యాస కర్ణాకర్‌రెడ్డి, బొప్పని యాదగిరి, రామగిరి వెంకటేశ్వర్లు, మామిడి కాయల నాగయ్య, కొండ అంజమ్మ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న కొండేటి మల్లయ్య

ధ్రువీకరణ పత్రాలకు పడిగాపులు



పడిగాపులు కాస్తున్న దరఖాస్తుదారులు

శాలిగౌరారం : రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించే పథకాన్ని ప్రవేశపెట్టడంతో దరఖాస్తులు చేసుకునేందుకు ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయానికి దరఖాస్తుదారులు అధిక సంఖ్యలో తరలిరావడంతో రద్దీగా మారింది. దరఖాస్తులను సంబంధిత సెక్షన్‌లో అందజేసేందుకు దరఖాస్తుదారులు పోటీపడడంతో పరిస్థితి గందరగోళంగా మారింది. కార్యాలయ సిబ్బంది జోక్యం చేసుకొని దరఖాస్తుదారులను లైన్‌లో నిలబెట్టి దరఖాస్తులు స్వీకరించారు. మండలంలో ఇప్పటి వరకు కుల ధ్రువీకరణ పత్రాల కోసం 1788 మంది, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం 2250 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి తెలిపారు.

రైతుల ఆందోళన

మర్రిగూడ : మర్రిగూడ పీఏసీఎస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంతోపాటు యరగండ్లపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తేడాలు ఎందుకు వచ్చాయని ధాన్యం విక్రయించిన రైతులు సంఘం సీఈఓ శ్రీనివాస్‌ను నిలదీశారు. శనివారం పలువురు రైతులు కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. 40 కేజీల బస్తాకు ఒక కేజీ చొప్పున తరుగు తీస్తున్నామని చెప్పి మిల్లుల వద్దకు వెళ్లేసరికి 7–8 కేజీల తరుగు ఎలా తీశారన్నారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ తమ వద్ద ఎలాంటి పొరపాటు జరగలేదని మిల్లుల వద్ద జరిగిందని రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు కర్నాటి సంతోష్, గునగోని వెంకటయ్య, రాంరెడ్డి, వెంకట్‌రెడ్డి, యాదయ్య, చంద్రకళ, రవి, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దాతల చేయూత

నార్కట్‌పల్లి : మండలంలోని నక్కలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు గ్రామానికి చెందిన బండ అమృతారెడ్డి కొడుకు, కోడలు భారతీయ విద్యా భవన్ డైరెక్టర్ బండ రమాదేవి అశోక్‌రెడ్డి శనివారం యూనిఫాం, బ్యాగులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రతి ఏడాది తమవంతు సహాయం చేస్తున్నట్లు తెలిపారు. దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి బాషపాక రవికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు, వాటర్ బాటిళ్ల అందజేత

కనగల్ : మండల పరిధిలోని రేగట్టె ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు చండూరు పట్టణానికి చెందిన బండారు శ్రీనివాస్ శనివారం నోటుపుస్తకాలు, వాటర్ బాటిళ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం పగిళ్ల సైదులు, ఉపాధ్యాయులు సంతోష, పద్మ, శివన్‌గౌడ్ పాఠశాల చైర్మన్ జక్కలి రాంబాబు, వైస్ చైర్మన్ జమ్ముల కోటేశ్వరి, వెంకన్న, శంకరయ్య, రజిత, శ్రీనివాస్ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



నార్కట్‌పల్లి : బ్యాగులు అందజేస్తున్న దాతలు

పుస్తకాలు, యూనిఫాం దందా అరికట్టాలి

నకిరేకల్ : ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో పుస్తకాలు, యూనిఫాం దందాను అరికట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్ డిమాండ్ చేశారు. నకిరేకల్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు పుస్తకాలు, యూనిఫాం, టై, బెల్టులు, సాక్స్ పేరుతో ఎల్‌కేజీకి రూ.5వేలు, పదో తరగతికి రూ.10వేల వరకు వసూలు చేస్తున్నారని అన్నారు. ప్రతి ఏటా బుక్స్, యూనిఫాం పేరుతో పేద, మధ్య తరగతి తల్లిదండ్రుల నుంచి డబ్బులు వసూలు చేయడం సరైంది కాదన్నారు.

మంచినీళ్ల పండుగను విజయవంతం చేయాలి

కట్టంగూర్ : తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించనున్న మంచినీళ్ల పండుగను, సోమవారం నిర్వహించే హరితోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ పోరెళ్ల సునిత అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పలు శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో ర్యాలీ అనంతరం పానగల్లు తాగునీటి శుద్ధీకరణ కేంద్రం వద్ద నిర్వహించే మంచినీళ్ల పండుగకు హాజరుకావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ అథర్‌ఫర్వేజ్, పలుశాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

హరితహారాన్ని విజయవంతం చేయాలి

నార్కట్‌పల్లి : దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం మండలంలో అధిక సంఖ్యలో మొక్కలు నాటి హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి కోరారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు అధికారులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో ఖాళీ స్థలాలను గుర్తించి మొక్కలు నాటాలన్నారు. ఎంపీడీఓ యాదగిరి, తహసీల్దార్ పులి సైదులు, ఎంపీఓ సత్యనారాయణ, ఫారెస్ట్ రేంజ్ అధికారి శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

చిట్యాల : మున్నూరు కాపు కులస్తుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేషన్ ఏర్పాటుచేసి ఐదు వేల కోట్ల రూపాయల నిధులు కేటాయించాలని పీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నూనె వెంకటస్వామి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చిట్యాలలో శనివారం జరిగిన మున్నూరు కాపు కులస్తుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాపు బంధు ఏర్పాటు చేసి పది లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందించాలన్నారు. గజ్జల రవి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో దుబ్బాక భిక్షం, బండారు ప్రభాకర్, ఎర్రమాద శ్రీనివాస్, కాటం సత్యనారాయణ, కొత్తపల్లి నర్సింహ, కొత్తపల్లి యాదయ్య, పగిడిపల్లి నర్సింహ, గుడిపాటి జానుకిశోర్, కట్కూరి భిక్షపతి పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

శాలిగౌరారం : మండలం నుంచి పీడీఎస్ బియ్యాన్ని శనివారం అక్రమంగా తరలిస్తున్న మినీ ట్రక్కును పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు. నకిరేకల్‌కు చెందిన ఓ మినీ ట్రక్కు 40 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం లోడుతో వెళ్తుండగా మండలంలోని అడ్లూరు, వల్లాల గ్రామాల మధ్య పట్టుకొన్నట్లు ఎస్ఐ తెలిపారు. వాహనాన్ని సీజ్‌చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గడువు పొడిగించాలి

చండూరు : కుల వృత్తిదారులు రూ.లక్ష ఆర్థిక సహాయం కోసం దరఖాస్తు చేసుకోవడానికి గడువు పొడిగించాలని బీజేవైఎం స్టడీ సర్కిల్ రాష్ట్ర కన్వీనర్ భూతరాజు శ్రీహరి శనివారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు.